

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 06-09-2025 | సంపుటి - 25 | సంచిక - 117 | రూ : 4 | పేజీలు:


## ఖైరతాబాద్ గణపతికి ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు



2లో

- దేశంలో ఎక్కడా లేనివిధంగా మండపాలకు ఉచిత కరెంట్ అందిస్తున్నామన్న ముఖ్యమంత్రి
- 71 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీకి అభినందనలు
- హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని వ్యాఖ్య
- శనివారం జరగనున్న నిమజ్జనానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

## నాకు స్వార్థం ఉంది..

### నేను రెండోసారి సీఎం కావాలనుకుంటున్నా!

- గురుపూజోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని విమర్శ
- విద్యాశాఖలో సంస్కరణలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్, సెప్టెంబర్ 05 :** "నాకు స్వార్థం ఉంది. ఉపాధ్యాయులు బాగా పనిచేస్తే నేను కూడా రెండోసారి ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నాను. అలాగని 'నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటాను... మళ్లీ ముఖ్యమంత్రిగా చేయండి' అని నేను అడగడం లేదు. మీతో పాటే నేను కూడా కష్టపడతాను" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యారంగాన్ని గత ప్రభుత్వం

తరువాయి 2లో





2లో

## గణేశ్ నిమజ్జనం..

### హైదరాబాద్‌లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో సేవలుహోమం

- అన్ని మెట్రో స్టేషన్ల నుంచి అందుబాటులో మెట్రో సేవలు
- ఉదయం 6 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మెట్రో సేవలు
- నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారికి మేలు

## ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులా ?



2లో



2లో

## ఫామ్ హౌస్ లో కేసీఆర్ హోమం

- గణపతి హోమం నిర్వహిస్తున్న కేసీఆర్
- భార్యతో కలిసి హోమంలో పాల్గొననున్న బీఆర్ఎస్ అధినేత
- గత ఐదు రోజులుగా ఫామ్ హౌస్ లోనే కేటీఆర్

## తురకపాలెంలో వరుస మరణాలు...

### ఎమర్జెన్సీ ప్రకటించాలని సీఎం ఆదేశం

- గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా పరిగణించాలని అధికారులకు స్పష్టం
- శని, ఆదివారాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశం
- సోమవారం నాటికి అందరి ఆరోగ్య నివేదికలు సిద్ధం చేయాలని గడువు
- 'మెలియాయిడోసిస్' వ్యాధి లక్షణాలుగా అనుమానిస్తున్న వైద్యులు
- కేంద్ర బృందాలు, అంతర్జాతీయ నిపుణుల సాయం తీసుకోవాలని సీఎం సూచన





2లో

మనిషి మనుగడలో ప్రధాన పాత్రను పోషించేది ప్రకృతి... గాలి, నీరు, భూమి ఈ మూడూ ప్రకృతిలో భాగమే.. ఈ మూడూ సమతుల్యంగా.. కాలుష్యం లేకుండా ఉన్నప్పుడే మానవజాతి క్షేమంగా, ఆరోగ్యంగా జీవించగలుగుతుంది.. పూర్వాశ్రమంలో ప్రతి ఒక్కరూ ప్రకృతిని ఒక దేవతలా ఆరాధించేవారు.. కాపాడుకునే వారు.. కానీ కాలగమనంలో ప్రకృతి నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది.. కాలుష్యాన్ని వెదజల్లే కెమికల్ అంటే రసాయన కర్మాగారాలు ఎలాంటి నిబంధనలు పాటించకుండా వేలసంఖ్యలో వెలిశాయి.. ఈ కంపెనీలను పర్యవేక్షించి, గాడిలోపెట్టి, సక్రమంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మీద వుంటుంది.. ఇది ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుంది.. నిష్ణాతులైన ఉద్యోగులు ఇందులో బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉంటారు..కానీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అవినీతి కాలుష్యంలో మునిగిపోయింది.. దీంతో విపరీత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని పర్యావరణ సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...



## కాలుష్యాన్ని కాపాడుతున్న అవినీతి కోట..

- లంచాల ముసుగులో జోగుతున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు..
- ప్రజల ప్రాణాలతో రాక్షస క్రీడ సాగిస్తున్న అధికారులు..
- ఎన్ని విమర్శలు వస్తున్నా పద్ధతి మార్చుకోని దౌర్భాగ్యం..
- ఈ నేలమీద సామాన్యులు జీవించే హక్కును కాలరాస్తున్న దుర్మార్గం..
- పర్యావరణాన్ని చెరబట్టి కాలుష్యాన్ని వ్యాప్తి చేస్తున్న అవినీతి ముష్కరులు..
- గంగలో పోసిన పన్నీరులా మారిపోతున్న పర్యావరణ వేత్తల పోరాటాలు..
- నేలను, నీటిని, గాలిని కూడా కాలుష్య కోరల్లో బంధిస్తున్నా చలించని ప్రభుత్వాలు..

2లో

## ధరణి దోపిడీ కోసమే

- అది నాటి పాలకులు అంటించిన వైరస్
- ఆ దుస్థితిని భూభారతి చట్టంతో దూరం చేశాం
- గత ప్రభుత్వంలో అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకే నాడు వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారు
- భూమిని చెరపట్టినోళ్లను తరిమికొట్టిన తెలంగాణ
- గ్రామ పాలన అధికారుల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



# కాలుష్యాన్ని కాపాడుతున్న అవినీతి కోట..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? కాలుష్యం నియంత్రించాల్సిన బాధ్యత ఎవరిది? - పొల్యూషన్ కంట్రోల్ బోర్డుది.. కానీ ఈ బోర్డు కాలుష్యాన్ని నియంత్రించడం మానేసి, కాలుష్యాన్ని కాపాడే అవినీతి కోటగా మారిపోయిందని ప్రజలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తుండటం తేలిగ్గా తీసుకోదగిన విషయం కాదు.. పరిశ్రమలు పర్యావరణ ప్రమాణాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి. కానీ లంచం తీసుకున్న వెంటనే రిపోర్టులు "క్లీన్"గా మారిపోతున్నాయి. ఫ్యాక్టరీలు నదులలో విషజలాలు పారబోసినా, గాల్లో విషవాయువులు వెదజల్లినా, పీసీబీ అధికారుల కళ్లకు కట్టిన నోట్ల కట్టల గోడలు వాటిని కనిపించకుండా చేస్తున్నాయి. ప్రజల ఫిర్యాదులు ఫైల్ కట్టలలో మాయం అవుతున్నాయి.

ఇది కేవలం అవినీతి కాదు.. ఇది ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణ భవిష్యత్తును బలితీసుకునే సామూహిక నేరం.

మూసీ నది విషమయ నదిగా మారడం, హుస్సేన్ సాగర్‌లో నురుగుల విషాన్ని కక్కడం, నగర గాలిలో విషతుల్యాలు పెరగడం.. ఇవన్నీ ప్రత్యక్షంగా అవినీతి అనే జాడ్యం నుంచి పుట్టుకొస్తున్నాయి.. ఊపిరి పీల్చుకోవడమే కష్టమయ్యే రోజులు వస్తున్నాయి.

ప్రభుత్వం ఈ అవినీతి వలయంలో కూరుకుపోయిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, "పచ్చని హైదరాబాద్" అనే నినాదం కేవలం ప్రచార పుస్తకాలకే పరిమితం అవుతుంది. కాలుష్య నియంత్రణ బోర్డు నిజంగా కాలుష్యాన్ని నియంత్రించాలంటే..అన్ని అనుమతులు, రిపోర్టులు పూర్తిగా ఆన్‌లైన్‌లో పారదర్శకంగా ఉండాలి.

స్వతంత్ర పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటుచేయాలి.

అవినీతి చేస్తూ పట్టుబడిన అధికారులను తక్షణమే తొలగించాలి.

లేకపోతే హైదరాబాద్ పర్యావరణం శ్వాస తీసుకోలేని స్థితికి చేరుకుంటుంది. అధికారుల అవినీతికి ప్రజల ఊపిరి బలైపోవడం క్షమించరాని నేరం..

ఒకప్పుడు "పచ్చని ముత్యాల నగరం"గా పేరు గాంచిన ఈ మహానగరం, ఈ రోజుల్లో గాలికి ఊపిరాడని స్థితికి చేరుకుంది. ఆకాశాన్ని తాకే భవనాలు, రాత్రింబవళ్ళు ఉక్కిరిబిక్కిరి చేసే ట్రాఫిక్, నిరంతరం ఉద్గారాలు వెదజల్లే పరిశ్రమలు.. ఇవన్నీ కలిపి నగరాన్ని నెమ్మదిగా విషపూరితం చేస్తున్నాయి. ఈ కాలుష్యాన్ని నియంత్రించాల్సిన ప్రధాన బాధ్యత పొల్యూషన్ కంట్రోల్ బోర్డుపై ఉంది. కానీ ఆశ్చర్యకరమైన విషమేమిటంటే, ఈ బోర్డు స్వయంగా అవినీతి కర్కోటకంలో చిక్కుకొని, ప్రజల ఆరోగ్యాన్ని బలితీసుకుంటోంది.

కాలుష్యం నియంత్రణ అనే పవిత్ర కర్తవ్యాన్ని పక్కన పెట్టి, అధికారుల గదుల్లో "డబ్బు చలామణి" ప్రధాన పాత్ర పోషిస్తోంది. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే ప్రతి దశలో లంచాలు సర్వసాధారణం. కాలుష్యాన్ని కొలిచే ల్యాబ్ రిపోర్టులు సత్యాన్ని ప్రతిబింబించాలి, కానీ వాస్తవానికి ఇవి లంచాల ప్రతిబింబంగా మారిపోయింది. నిజంగా కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నా "క్లీన్ చిట్" సర్టిఫికెట్ ముద్ర వేయడం బోర్డు సంస్కృతిగా మారింది.

**ఈ అవినీతి మూల్యం చెల్లిస్తున్నది ప్రజలే.**

గాలి నాణ్యత ప్రతి రోజూ దిగజారిపోతోంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రమాణాలను మించి ఉన్న కాలుష్య సూచికలు నగరవాసుల ఊపిరితిత్తులను నాశనం చేస్తున్నాయి.

చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు శ్వాస సంబంధిత సమస్యలు, చర్మ రోగాలు, నీటిమూలం వ్యాధులు పెరుగుతున్నాయి. వ్యవసాయ భూములు విషతుల్యం అవుతున్నాయి.. జంతువులు, పక్షులు సైతం బలైపోతున్నాయి..

మరీ దారుణమైన విషయం ఏమిటంటే.. కాలుష్య సమస్యలపై ప్రజలు పదేపదే ఫిర్యాదులు చేసినా, అవి ఫైళ్లలో మగ్గిపోతున్నాయి. ఎందుకంటే ఆ ఫైళ్లపై కట్టిన నోట్ల గడ్డలు అధికారుల కళ్లకు, చెవులకు మూతలు వేస్తున్నాయి. ఒకవేళ నిజమైన తనిఖీలు జరిగితే పరిశ్రమల 70శాతం



మూసేయాల్సి వస్తుందని నిపుణుల వ్యాఖ్య. కానీ అవినీతి వ్యవస్థ వారిని రక్షిస్తోంది.

ఇక్కడ జరిగేది కేవలం అధికారుల లంచగొండి సంస్కృతి కాదు. ఇది ప్రజల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును బలి తీసుకునే సామూహిక నేరం. రేపటి తరాలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడేలా చేస్తే, ఈ అవినీతికి పాల్పడిన వారు నేరస్థులు కాదా?

ప్రభుత్వం ఈ అవినీతి బోర్డుపై కన్నెర్ర చేయకపోతే, అది కూడా నేరానికి భాగస్వామి అవుతుంది. "పచ్చటి హైదరాబాద్" అనే నినాదం ప్రసంగాల్లో బాగానే వినిపిస్తుంది, కానీ వాస్తవానికి పచ్చదనం కాంక్రీట్ జంగిల్‌లో కనుమరుగైపోతోంది..

కాలుష్యం నియంత్రించాల్సిన బోర్డు స్వయంగా అవినీతికి అడ్డాగా మారితే, నగరం ఊపిరాడని స్థితికి చేరుకోవడం సహజం. ఇప్పుడు మౌనంగా ఉండే సమయం కాదు. ప్రజలు, మీడియా, పౌర సంఘాలు కలసి బలమైన ఒత్తిడి తెచ్చి, అవినీతి అధికారులను బయటకు తీయాలి. లేనిపక్షంలో రేపటి హైదరాబాద్ విషగూళ్లలో చిక్కుకున్న శవాల నగరంగా మారిపోవడం తప్పదు.

ఈ వ్యవహారంపై పోరాటం సాగిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " మాతో చేతులు కలపండి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన, కాలుష్యం లేని రాష్ట్రాన్ని నిర్మించుకుందాం..

# నాకు స్వార్థం ఉంది.. నేను రెండోసారి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నా!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారంగా మార్చుకుందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం మూతపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గురుపూజోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్యను అందిస్తామని అందరం ప్రతిజ్ఞ చేద్దామని అన్నారు. ప్రతి సంవత్సరం 200 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపించి అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసేలా ప్రోత్సహిద్దామని ఆయన అన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి అధికారంలోకి రావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణమని వ్యాఖ్యానించారు. నేను కూడా విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని హామీ ఇచ్చారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని ముఖ్యమంత్రి అన్నారు. చాలాచోట్ల కేజీ టు పీజీ ఉచిత విద్య అందడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే అన్నారు. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో గురుపూజోత్సవం జరిగిందా? అందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల సహకారం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్ల టీచర్ల కంటే ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ అని వ్యాఖ్యానించారు. విద్యాశాఖను తీసుకోవద్దని, ఆ శాఖ వివాదాస్పదం అని తనకు సూచించినా, తానే స్వయంగా ఆ శాఖను తన వద్ద ఉంచుకున్నట్లు చెప్పారు.

# ఇందిరమ్మ రాజ్యమంటే

## వేధింపులు, బెదిరింపులా? : కవిత

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. యూరియా గురించి ప్రశ్నిస్తున్న వారిని వేధిస్తున్నారని మండిపడ్డారు. యూరియా కొరతపై ప్రశ్నించడమే నేరమా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యమంటే వేధింపులు, బెదిరింపులా? అని అడిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో యూరియా కొరతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతు లక్ష్మణ్ యాదవ్ నిలదీశాడని పోలీసులు ఇంటికి వెళ్లి వేధింపులకు గురిచేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడమే ఆలస్యం అన్నట్టుగా పోలీసులు చట్టవ్యతిరేక చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. ఇలాంటి దారుణాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని అన్నారు. పాలకుల మెప్పుకోసం ప్రజలను ఇబ్బంది పెడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే విషయం గుర్తు పెట్టుకోవాలని కవిత హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మెట్రో సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో శుభవార్త తెలిపింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు అన్ని మెట్రో స్టేషన్ల నుంచి మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. నిమజ్జనం చూసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వెళ్లే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

# ధరణి దోపిడీ కోసమే

హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు, ప్రజలకు ధరణితో పట్టిన దుస్థితిని భూభారతి చట్టంతో దూరం చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భూమిని చెరపట్టినోళ్లను దిగంతాలకు తరిమికొట్టిన చరిత్ర తెలంగాణకు ఉందని, ధరణి అనేది ఆనాటి పాలకులు అంటించిన వైరస్ అని వ్యాఖ్యానించారు. ధరణి ముసుగులో దోపిడీకి పాల్పడిన వారికి ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. 'గత పాలనలో వీఆర్‌వోలను, వీఆర్‌ఏలను సమాజం ముందు దోషులుగా నిలబెట్టి రోజుల కొద్దీ విషప్రచారం చేశారు. ఈ విషయం ప్రజల మెదళ్లలో బలంగా నాటుకుంది. ఆ మచ్చ తొలగించుకునే అవకాశం నియామక పత్రాలు పొందుతున్న 5 వేల మంది గ్రామ పాలన అధికారుల చేతుల్లో ఉంది. గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించండి. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయండి. తొమ్మిది లక్షల సాదాబైనామాలు ఏళ్లుగా నిరీక్షిస్తున్నాయి. వీటికి పరిష్కారం చూపించాలి' అని సీఎం ఉద్బోధించారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన ప్రజాపాలనలో కొలువుల పండగ కార్యక్రమంలో 5,106 మందికి గ్రామ పాలన అధికారులుగా (జీపీవోలుగా) ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. 'గత ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు కొల్లగొట్టిన భూముల వివరాలు బయటకు తీయండి. నాడు జరిగిన దోపిడీ, తప్పుడు విధానాలు, అక్రమాలు ప్రజలకు వివరించండి' అని జీపీవోలకు సూచించారు.

**ధరణి భూతంలా పట్టిపీడించింది..**

"గత పాలకుడు.. తన భూదాహంతో భూమిని చెరబట్టేందుకు ధరణి భూతాన్ని సృష్టించారు. ధరణి ద్వారా కొల్లగొట్టే భూముల వివరాలు ప్రజలకు తెలియకుండా ఉండేందుకు వీఆర్‌ఏ, వీఆర్‌వో వ్యవస్థల్ని తొలగించారు. వారిని నిస్సహాయుల్ని చేసి ఉద్యోగాల నుంచి విసిరేశారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఎవరిని కదిలించినా ధరణి.. భూతంగా మారి పీడిస్తోందని.. ఈ కొరివి దయ్యం నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అందుకే భూభారతి 2025 చట్టాన్ని తెచ్చి తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలకు అంకితం చేశాం.

**నాడు ఎన్నెన్నో ఘటనలు...**

ధరణితో రికార్డుల్లో యజమాని పేరు రాదు.. అమ్ముకున్నోడి పేరు వస్తుంది. తహసీల్దార్ల వద్ద అధికారం లేదు. కలెక్టర్లకు బాధ్యతలు ఇచ్చి, నాడు కుర్చీల్లో కూర్చున్న పెద్దలు అధికారం తమ చేతుల్లో పెట్టుకున్నారు. ప్రజల్లో కోపం ఆవేశంగా మారడంతో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌ను సజీవదహనం చేశారు. సిరిసిల్లలో ఓ ఆడబిడ్డ ధరణితో సమస్య వచ్చిందని, సవరించాలని తన తాళిబొట్టును తహసీల్దారు కార్యాలయానికి పెట్టారు. వాస్తవానికి ఇది అధికారుల సమస్య కాదు.

# ఖైరతాబాద్ గణపతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** గణేశ్ నిమజ్జనానికి ఒకరోజు ముందు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ బడా గణేశ్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఉత్సవ కమిటీని ఆయన అభినందించారు. తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ నగరంలోనూ ఇలాంటి సౌకర్యం కల్పించలేదని ఆయన పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి ఆటంకాలు లేకుండా భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు. హైదరాబాద్ నగరం అన్ని మతాలను గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన కొనియాడారు. శనివారం జరగనున్న నిమజ్జన కార్యక్రమాన్ని కూడా భక్తిశ్రద్ధలతో, జాగ్రత్తగా పూర్తిచేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్ బండ్ సహా ఇతర ప్రాంతాల్లో నిమజ్జనం కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని ఆయన వెల్లడించారు. ఆగస్టు 27న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తొలి పూజతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది 'విశ్వశాంతి మహాశక్తి గణపతి' పేరుతో 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో మట్టి, స్టీల్, వరి పొట్టుతో రూపొందించిన ఈ భారీ విగ్రహాన్ని దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గురువారంతో స్వామివారి దర్శనం ముగిసింది. ప్రస్తుతం, ఈ భారీ విగ్రహాన్ని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు అధికారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# తురకపాలెంలో వరుస మరణాలు...

## ఎమర్జెన్సీ ప్రకటించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, సెప్టెంబర్ 05:** గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలుగా చోటుచేసుకుంటున్న వరుస మరణాలు తీవ్ర కలకలం రేపుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితిని సమీక్షించేందుకు రంగంలోకి దిగారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను 'హెల్త్ ఎమర్జెన్సీ'గా పరిగణించాలని, తక్షణం చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన సీఎం, ఈ సమస్య మూలాలను గుర్తించి, ప్రజల్లో భరోసా నింపాలని స్పష్టం చేశారు. గడిచిన జూలై, ఆగస్టు నెలల్లో గ్రామంలో పదుల సంఖ్యలో ప్రజలు అంతుచిక్కని వ్యాధితో మరణించడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి, అసలు కారణాలను నిగ్గు తేల్చాలని సూచించారు. తక్షణ కార్యాచరణలో భాగంగా, ఈ శని, ఆదివారాల్లో ప్రత్యేక వైద్య బృందాలను గ్రామానికి పంపించి, ప్రతి ఒక్కరికీ నిర్దేశించిన 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం నాటికి గ్రామస్థులందరి 'హెల్త్ ప్రొఫైల్' సిద్ధం చేసి తనకు నివేదించాలని గడువు విధించారు. అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు.

**కేంద్ర బృందాల సాయం తీసుకోండి**

"తురకపాలెం సమస్యను తేలిగ్గా తీసుకోవద్దు. అవసరమైతే ఎయిమ్స్ సహా కేంద్ర వైద్య బృందాలను గ్రామానికి రప్పించండి. అంతర్జాతీయ వైద్య నిపుణుల సలహాలు తీసుకోవడానికి కూడా వెనుకాడొద్దు" అని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, భూమి ద్వారా కూడా బ్యాక్టీరియా వ్యాపించే ప్రమాదం ఉందని, అన్ని కోణాల్లోనూ పరిశోధన జరపాలని ఆయన ఆదేశించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. "కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాకూడదు. ప్రతి రోగిని నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉంచాలి. స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత మీదే" అని సీఎం స్పష్టం చేశారు.

**'మెలియోయిడోసిస్'గా అనుమానం!**

ఈ సమావేశంలో వైద్యాధికారులు తమ ప్రాథమిక పరిశీలన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం బాధితుల్లో కనిపిస్తున్న లక్షణాలు 'మెలియోయిడోసిస్' అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను పోలి ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. నిర్ధారణ కోసం రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపామని, 72 గంటల్లో తుది నివేదికలు వస్తాయని తెలిపారు. తురకపాలెంలో పశుపోషణ అధికంగా ఉన్నందున, జంతువుల నుంచి ఏమైనా బ్యాక్టీరియా వ్యాపించిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. గ్రామంలో డయాబెటిస్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, ఆల్కహాల్ వినియోగం కూడా అధికంగా ఉందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్ల కారణంగా వాతావరణ నాణ్యతను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బాధితుల్లో చాలామందికి మొదట జ్వరం, దగ్గుతో ప్రారంభమై, ఆ తర్వాత ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని వివరించారు. మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమిలో, నిల్వ ఉన్న నీటిలో ఉండే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు తెలిపారు. చర్మంపై ఉన్న గాయాల ద్వారా లేదా కలుషిత నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుందని వారు పేర్కొన్నారు.

# ఫామ్ హౌస్ లో కేసీఆర్ హోమం

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు దైవ భక్తి ఎక్కువనే విషయం తెలిసిందే. హోమాలపై ఆయనకు ఎంతో నమ్మకం. ఇప్పటికే ఆయన ఎన్నో సార్లు పలు రకాల హోమాలను నిర్వహించారు. తాజాగా మరో హోమం నిర్వహించేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గణపతి హోమం నిర్వహించబోతున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు హోమం ప్రారంభమవుతుంది. తన భార్య శోభతో కలిసి కేసీఆర్ హోమంలో పాల్గొననున్నారు. విఘ్నాలు తొలగాలని ప్రార్థిస్తూ కేసీఆర్ హోమం నిర్వహించనున్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గత ఐదు రోజులుగా ఎర్రవల్లి ఫామ్ హౌస్ లోనే ఉన్నారు. హోమానికి కొద్ది మంది నేతలను మాత్రమే ఆహ్వానించారు.

# ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది





* **ట్రినిటీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురుపూజోత్సవం**
* **చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సమాజంలో అన్ని వృత్తులకెల్లా ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదని చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో మండలంలోని అల్లాపురం పరిధిలోని సరళ మైసమ్మ దేవాలయం వద్ద శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు హాజరయ్యారు. గురుపూజోత్సవాన్ని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రినిటీ పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, డాక్టర్లు, లాయర్లు, ఉన్నత అధికారులను తయారు చేసేది ఉపాధ్యాయులు మాత్రమేనన్నారు. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమన్నారు. సరళ మైసమ్మ దేవాలయం ఆవరణలో గురువుల సన్మానించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయ బృందమంతా ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కే వి బి కృష్ణారావు, పంతంగి మాజీ సర్పంచ్ సత్యం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ ప్రవక్త సకల మానవాళికి కారుణ్యం

* **సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలో శుక్రవారం అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ , ఐలే సున్నత్ వల్ జమాత్, రైల్వే మస్జిద్ కమిటీ కలిసి మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా కొత్తగూడెం జిల్లా ఏరియా ఆసుపత్రిలో రామవరం మాతా శిశు ఆసుపత్రిలో పేషెంట్లకు ఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా చేతుల మీదుగా ప్రారంభించి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ జె చైర్మన్ ఎం ఏరజాక్, ఏ డబ్ల్యు ఎస్ అధ్యక్షులు ఎండి అమీర్ ఖాద్రి, ఎస్. కె ఖాజా బాబా, కరీం ఖాద్రి, హుస్సేన్, యూసుఫ్, ఖమర్, బాబు జాని ఖాన్, జమాల్, అక్బర్, నయీమ్, , యాసీన్, అన్వర్ ఖాద్రి, యాకూబ్ ఖాద్రి, షఫీ ఖాద్రి , మహబూబ్ ఖాద్రి, శమీయుద్దీన్, యూసుఫ్, మజీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ మద్యపానం సేవిస్తే కఠిన చర్యలు

* **ఇల్లందు డి.ఎస్ పి ఎన్.చంద్రబాను**





ప్రజాస్ఫూర్తి, ఇల్లందు : జిల్లా ఎస్పీ బి రోహిత్ రాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు. ఇల్లందు డి.ఎస్ పి ఎన్.చంద్రబాను, పట్టణ సీఐ టీ.సురేష్ పర్యవేక్షణలో ఇల్లందు ఏరియా లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ చంద్రబాను మాట్లాడుతూ మద్యపానం సేవిస్తూ రోడ్ల వెంబడి వెళ్లే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, మద్యం మత్తులో ఘర్షణ పడుతున్న కొందరు యువకులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేయటమైనదని వారిని న్యాయస్థానం ముందు హాజరు పరచడం జరుగుతుందని దాంతోపాటు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి రోడ్ల పైన రహదారుల పైన బహిరంగ గాని మద్యపానం సేవిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి మందు బాబులకు హెచ్చరించారు.

## వెలుగులేని వీధులు

* **నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్ అధికారులు**
* **భయాందోళనలో స్థానికులు**



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: ఇంటి టాక్స్ కట్టకపోతే ముక్కు పిండి వసూలు చేస్తారు. లేదా ఆస్తులు జప్తు చేస్తామని ఆటోల్లో మైక్ పెట్టి హడావుడి చేసే మున్సిపల్ అధికారులు. అదే అధికారులు ప్రజల భద్రతకు అవసరమైన వీధి దీపాల ఏర్పాటు విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇల్లందు పట్టణంలోని 14 నెంబర్ బస్తిలో పలు విద్యుత్ స్తంభాలు లైట్లులేక బోసిపోవడంతో, చీకట్లో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరి ఇళ్ల ముందు మాత్రం ప్రత్యేక శ్రద్ధతో లైట్లు అమర్చడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వీధి దీపాలు లేకపోవడంతో వర్షాల సమయంలో పాములు, తేళ్లు రోడ్లపై సంచరిస్తుండటంతో చీకటి వీధుల్లో భయంతో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఉంటే ఉపయోగం ఏమిటి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వీధి దీపాల ఏర్పాటు వంటి ప్రాథమిక సదుపాయాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజల భద్రతే ప్రమాదంలో పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వీధిలైట్లు ఏర్పాటు చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో ఫోటోలతో సహా ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్న స్థానికులు.



## భక్తి శ్రద్ధలతో లంబోదరుడికి పూజలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలలో బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి జగద్గిరి నగర్ లోని బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదాత పార్శి ప్రకాష్ గుప్తా 500 మందికి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జే.కె.శేఖర్ యాదవ్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ మండపం వద్ద అన్నదాత పార్శి ప్రకాష్ గుప్తా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ భీమయ్య, బస్తి అధ్యక్షులు జగన్ ముదిరాజు, నాగరాజు కుమార్ యాదవ్ , ముత్యాలు , సుధాకర్ , జానకిరామ్ , రమేష్ , యాదగిరి రాజు , అంజయ్య నగర్ లో వేణు, బీరప్ప నగలను మంగ యాదవ్, గోవర్ధన్ గౌడ్, హరినాథ్ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుడికి.. పూజలు నిర్వహించిన దిండిగల రాజేందర్

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: వినాయక నవరాత్రి ఉత్సవాలను పునస్కరించుకొని ఇల్లందు పట్టణంలోని. ఆర్&ఆర్ కాలనీ 12 వార్డులో కమ్యూనిటీ హాల్ లో గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద రాకేష్ అండ్ సాగర్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రుల్లో భాగంగా, ఇల్లందు పట్టణం కళాస్ బస్తి బస్తీలో కమిటీ సభ్యుల , సంజీవరెడ్డి అన్నదాన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు టిఆర్ఎస్ పార్టీ ఫౌండర్ మెంబర్ దిండిగల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆమ్ బజార్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు భాగంగా, పెండ్యాల ,హరికృష్ణ, సన రాజేష్, పెండ్యాల రాజు మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో_ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ కడకంచి పద్మ, ఇల్లందు బి ఆర్ఎస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి, ఇల్లందు పట్టణ కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు ,భావు సింగ్ అన్న , ఉపేందర్, రాచపల్లి శీను, కడకంచి వీరస్వామి,నారపాక వసంత్,లలిత్ కుమార్ పాసి, గడ్డి శీను, ఇమ్రాన్, మునిగంటి శివ, తుంగ మహేష్, పరక పల్లి రవి, ముత్తయ్య,కిషన్ లాల్ పాసి, కళ్యాణ్, రాంలాల్ పాసి, ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్..



అందోలు, ప్రజాస్ఫూర్తి: అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తోందని ద్వారా మాజీ ఏఎంసీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ లు కలిసి అందజేశారు. శుక్రవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో బాధితుడు గూడెం మల్లేశం కు రూ.లక్ష విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక సహాయం ఎంతో సహాయపడుతుందని అన్నారు. ఎవరైనా పేదవారు. అనివార్య పరిస్థితులలో ప్రవేట్ ఆసుపత్రులలో చేరి ఆర్థిక ఇబ్బందులకు గురైతే వారికోసం ప్రభుత్వ ఆసుపత్రిలోనే కార్పొరేట్ కు ధీటుగా వైద్యసేవలు అందిస్తున్నారని, ఈ సేవలను పేదవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో నాయకులు తెనుగు మహిపాల్,రమేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ వీరేశం, హనుమంత్ రెడ్డి, నాగభూషణం, ప్రభు, యాదయ్య,పోచయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రూ.1,26,000లకు పలికిన విజయనగర్ కాలనీ గణేషుడు లడ్డూ



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయ్ నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. 9 రోజులు పూజలందుకున్న గణనాథుడి లడ్డును గురువారం రాత్రి గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో గోవా గోవిందారు రూ.1,26,000లకు లడ్డు ను దక్కించుకున్నారు. అనంతరం విజయనగర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుడిని ఏడుపాయల వన దుర్గమ్మ తల్లి సన్నిధిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గణేశ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొగిలి నాగయ్య పార్థివ దేహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండల పర్యటనలో భాగంగా బొజ్జయిగూడెం గ్రామం కు చెందిన మొగిలి నాగయ్య గుండె పోటుతో మరణించారనే విషయాన్ని ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి పార్టీకి దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, బొజేగూడెం మాజీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్ తదితరులు ఉన్నారు.

## సర్వేపల్లి జీవితం నేటి తరానికి ఆదర్శం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని పిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు అన్నారు. సర్వేపల్లి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపక వృత్తి నుండి మొదలైన ఆయన ప్రస్థానం భారత దేశ ఉప రాష్ట్రపతిగా రాష్ట్రపతిగా ఎదిగే వరకు సాగిందని, భారత దేశ రాజకీయాల్లో ఆయన చెరగని ముద్ర వేసుకున్నారనీ, అలాంటి విద్యా కోవిధుని జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకుంటామని తెలిపారు. విషయ పరిజ్ఞానం సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం అత్యుత్తమ బోధన పరిణితి గల సర్వేపల్లి జీవితం నేటి తరానికి దిక్సూచి కావాలని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎందరో విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దుతూ ఉద్యోగాలు సంపాదించడానికి కృషిచేసిన గ్రంథపాలకురాలు జి మనీ మృదుల ను సన్మానించారు.

# పల్లె ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది :ఎమ్మెల్యే కనకయ్య

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: పల్లె ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు మండలం పర్యటనలో భాగంగా బొజ్జాయిగూడెం, లచ్చగూడెం, సీఎస్పి బస్తీ, మిట్టపల్లి గ్రామాలలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి అయిన గ్రామ పంచాయితి భవనాలను ప్రారంభించిన అనంతరం 1కోటి20 లక్షల రూపాయల వ్యయంతో బొజ్జాయి గూడెం, సుదిమళ్ళ, పుబెల్లి, పొలారం, కొమరారం, మాణిక్యారం, ముత్తారపు కట్ట గ్రామాలలో నిర్మించ తలపెట్టిన నూతన సిసి రోడ్లుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము,మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు,సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ,మాజీ ఎంపిపిలు చీమల నాగరత్నంజాని,మోకాళ్ళ వెంకటమ్మ,మాడుగుల సాంబమూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీను,ఈసం లక్ష్మణ్,చెన్నూరి శ్రీను,ధారవత్ చంద్రశేఖర్,సొసైటి వైస్ చైర్మెన్ పుసల నాగేశ్వరావు,కిన్నెర నర్సయ్య,అరెం కిరణ్,చీమల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపిటిసి క్రిష్ణ ప్రసాద్,జోగా శ్రీకాంత్,మూతి క్రిష్ణ,కల్తీ పద్మ,బానోత్ శారద,బండి ఆనంద్, దండుగుల శీవ, కాకటి భార్గవ్, కొడెం క్రిష్ణ ప్రసాద్, చీమల బక్కయ్య, రావుల అయిలయ్య, నెల్లూరి వెంకటేశ్వర్లు, గుగులోత్ నాగార్జున్, సూర్నపాక వెంకటేష్, బొర్రా రమేష్, ధారవత్ తులిశ్యా, వెంకన్న, అశోక్,తదితరులు పాల్గోన్నారు.



## ఎంపీసీ చైర్మెన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దంపతులు ఆశీర్వచనం



ప్రజాస్ఫూర్తి ,ఇల్లందు : ఇల్లందు మండలం పర్యటనలో భాగంగా మాణిక్యారం గ్రామం కు అభివృద్ధి శంకుస్థాపనల నిమిత్తం వెళ్ళిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య,లక్ష్మి ,ఎఎంసీ చైర్మెన్ బానోత్ రాంబాబు, రోజా కుమార్తె లోహిత పుష్పలంకరణ వేడుకకు అసెంబ్లీ సమావేశాల వలన హజరుకాకపోవడంతో శుక్రవారం వారి ఇంటి స్వయంగా వెళ్ళి కుటుంబ సభ్యులకు పట్టువస్త్రాలు పెట్టి ఆశీర్వదించారు.

## ఘనంగా భజన్ మందిర్ గణేష్ నిమర్జనం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ భజన్ మందిర్ గణేష్ 79వ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల అనంతరం గురువారం భజన్ మందిర్ వద్దే వినాయకుని నిమర్జనం నిర్వహించారు. వేదపండితుల చేత మంగళ హారతులు, పంచామృతాభిషేకాలు, పూలాభిషేకాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తిన్మార్ మల్లన్న ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన్ మందిర్ ఉత్సవ సమితి అధ్యక్షులు పండాల శివకుమార్ గౌడ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్‌ల ఆధ్వర్యంలో తిన్మార్ మల్లన్నకు శాలువా కప్పి సన్మానం చేశారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుషాయిగూడలో అన్నప్రసాదం వితరణ




ప్రజాస్ఫూర్తి, కాప్రా : గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా శుక్రవారం కుషాయిగూడ పారిశ్రామిక వేత్తల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ జరిగింది. అన్నదాతగా ప్రముఖ పారిశ్రామికవేత్త బొండాడ రాఘవేంద్రరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదువేలకు పైగా భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కాకుమాను కిషోర్, వెంకట రమణ, కింగ్స్ బాబు, ఎం.ఎస్.ఎన్. రాజు, మధు, హైటెక్ బాబు, కే.డి.ఎస్. నరేందర్, యూ.ఎస్.ఎన్. మూర్తి, సుధాకర్, శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సర్వం సిద్ధం

* **జిల్లా నలుమూలల నుంచి భద్రాచలం తరలి రానున్న వేలాది విగ్రహాలు**
* **కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్ లో భారీ స్వాగత వేదిక ఏర్పాటు**
* **ఉత్సవ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గత నెల 27 వ తేదీన ప్రారంభం అయిన వినాయక చవితి ఉత్సవాలు శనివారం నిమజ్జన కార్యక్రమంతో ముగియనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి మాత్రమే కాకుండా ఖమ్మం, నల్గొండ తదితర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున విగ్రహాలు భద్రాచలం గోదావరి నది తీరానికి తరలి రానున్నాయి. ఇందుకోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. భారీ క్రెన్లు, గజ ఈత గాళ్ళను సిద్ధంగా ఉంచారు. శనివారం అర్ధరాత్రి వరకు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగనుంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నేతృత్వంలో అధికార యంత్రాంగం ఇందుకు సంబందించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సూపర్ బజార్ సెంటర్ వద్ద భారీ స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. గత 40 ఏళ్లుగా ఈ అనవాయితీ కొనసాగుతుంది. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయం కొనసాగిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు లక్ష్మన్ మీడియకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4.00 గంటలకు ప్రకాశం స్టేడియంలో గణపతికీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి శోభా యాత్రగా బస్ స్టాండ్ నుంచి సూపర్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద స్వాగతం అందుకుని నిమజ్జనం నిమిత్తం భద్రాచలం బయలుదేరుతాడని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నారు. పెద్ద సంఖ్యలో హాజరు కావాలని అయన పిలుపునిచ్చారు..

## కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత

* **రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు మద్దతుగా ఆందోళనలు**
* **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ విమర్శించారు, శుక్రవారం మంచికంటి భవన్ లో జరిగిన జిల్లా కమిటీ సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రం లో అదికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రణాళిక లోపం వల్ల రైతులకు సరిపడా యూరియా ,డీఏపి ఉత్పత్తి, దిగుమతి చేసుకోవడం లో వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు,11 రాష్ట్రాలలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందన్నారు, తెలంగాణ రాష్ట్రం లో రైతులు యూరియా కోసం రాత్రింబవళ్ళు పడిగాపులు కాస్తున్నారని అన్నారు,ప్రతి ఎకరానికి ఐదు చొప్పున యూరియా బస్తాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు, చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా బిజెపి ప్రభుత్వం ఇప్పుడు యూరియా దిగుమతి కోసం చైనా , మొరాకో, సౌదీ అరేబియా దేశాలతో ఒప్పందాలు చేసుకుందన్నారు,మతం పేరుతో రాజకీయాలు చేయడంలో ఉన్న శ్రద్ధ, వ్యవసాయ రంగం అభివృద్ధి పై లేదన్నారు, దేశీయ ఉత్పత్తి 10.2 శాతం తగ్గడం , దిగుమతులు 12.7 శాతం తగ్గడం వల్ల దేశ వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు, తెలంగాణ రాష్ట్రం లో అన్ని జిల్లాల్లో యూరియా కొరత ఉందని, రామగుండం ఎరువుల పరిశ్రమ 145 రోజులకు 85రోజులు ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల సమస్య తీవ్రత పెరిగిందన్నారు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నారని , వారి ఆందోళనలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు, తెలంగాణ రాష్ట్ర



ముఖ్యమంత్రి అఖిలపక్షం తో కేంద్ర ప్రభుత్వం పై పోరాటం చేయాలని కోరారు,

**బ్లాక్ మార్కెటింగ్ నియంత్రించాలి.**

రాష్ట్రంలో యూరియా అందక అనేక ఇబ్బందులు పడుతున్న రైతులకు యూరియా అందకుండా దళారులు అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు, బ్లాక్ మార్కెట్ లో యూరియా లభించడం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు, ప్రభుత్వం, అధికారులు దళారులపై,అవినీతి పరులపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో బ్లాక్ మార్కెట్లో ఉన్న యూరియా రైతులకు పెంచుతామని హెచ్చరించారు,ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య,ఎజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి,కారం పుల్లయ్య,ఎం.జ్యోతి,కె.బ్రహ్మచారి,లిక్కి బాలరాజు,అన్నవరపు సత్యనారాయణ,రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు బి.చిరంజీవి, మర్మం చంద్రయ్య, దొడ్డ రవికుమార్,ఎస్ ఎ నబి,నిమ్మల వెంకన్న, భూక్యా రమేష్, కొండపల్లి శ్రీధర్, కున్సోత్ ధర్మా, యలమంచి వంశీ, ముదిగొండ రాంబాబు, గడ్డం స్వామి, పిట్టల అర్జున్,మోరంపూడి శ్రీనివాసరావు,యాసా నరేష్, సత్రపల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## సినీ ప్రేక్షకులు స్పిరిట్ సినిమాను చూసి ఆదరించాలి

* **సినీ ప్రేక్షకులు స్పిరిట్ సినిమాను చూసి ఆదరించాలి**
* **కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సినీ ప్రేక్షకులు స్పిరిట్ సినిమాను చూసి ఆదరించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సరికొత్త కథతో తెరకెక్కిన సినిమా స్పిరిట్ హర్రర్ జోనర్లో మంచి కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది.అందులోనూ ఒక సాధారణ రైతు మహిళ ధైర్యం చేసి తను చిన్ననాటి కలని నెరవేర్చుకుంటూ తన జీవనాధారమైన పశువుల్ని పొలాన్ని కూడా అమ్మి తీసింది అంటే ఆమె పట్టుదలను అభినందించ తగ్గ విషయం అని ఎమ్మెల్యే అన్నారు.స్పిరిట్ మూవీ పోస్టర్ని లాంచ్ చేసిన మాధవరం నరసమ్మ వెంకటేశ్వర్లు కు అభినందనలు తెలుపారు. ప్రొడ్యూసర్ రైతు నరసమ్మ మాట్లాడుతూ 8త్ వండర్ సినిమాస్ లో మేము తీసిన స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమా సెన్సార్ కూడా




పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. సెప్టెంబర్ 26న లేదా అక్టోబర్ 3 న ఈ సినిమాను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్తూ ఈ సినిమాలో. రవిబాబు, సత్యప్రకాష్ చిత్రం శ్రీను, ప్రధాన పాత్రలో నటించారు చెప్తూ సినిమాకు దర్శకత్వం సిహెచ్. వెంకట రవీంద్రనాథ్ ఎంఎస్., సంగీతం సంతోష్ కావల, సినిమాటోగ్రఫీ పి.భర్త రాజు కమల్, ఎడిటర్ కెవివై పాపారావు వ్యవహరిస్తున్నారు అని చెప్పారు

## ఉపాధ్యాయురాలు కు మొక్కను అందజేసిన ప్రకృతి ప్రేమికులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, సింగరేణి యన్, ప్రకృతి హరిత దీక్ష సభ్యులు నైనిక రజువా, ఉదయ్ నేచర్ క్యూర్ సెంటర్ ప్రకృతి వైద్యులు జి. సుగుణరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొక్కల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో మార్పు తీసుకువచ్చే మహానుభావులు గురువులు. వారు జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దుతారు అని అన్నారు.

## తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



హైదరాబాద్, బ్యూరో.(ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్కో, జెన్కో, విద్యుత్ పంపిణీ సంస్థలు టీజీఎస్పీడిసీఎల్, టీ.జీతైఆడ టీజీఎస్పీడిసీఎల్, లో పనిచేస్తున్న సుమారు 2500 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు సభ్యులుగా ఉన్న టీఎస్ ఈఏఈఏఈఏఈఏ (తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్) ఎన్నికలు ఈ నెల 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 34 బ్రాంచిలలో ఘనంగా జరిగాయి. 87.2 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. కెటీపీఎస్ పాల్వంచ ప్రధాన కేంద్రంగా, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ బి. రవికుమార్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా టీఎస్ ఈఏఈఏ లో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నాయకులను ఎన్నుకోవడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచిందన్నారు. ఈ రోజు వెలువడిన ఫలితాల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా జి. పవన్ కుమార్ (ఏఈ టీజీటీఆర్లెన్ఎస్సీఓ రాష్ట్ర కార్యదర్శిగా టి. మహేష్ (ఏఈ / కేబీహెచ్బీ ) వర్గం అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించిందన్నారు.

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:టీచర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ కొత్తగూడెం మిల్లినియం ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. రామవరంలోని గణేష్ దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో గురువులను శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువు, సమాజ నిర్మాణానికి పునాదిరాయి అని ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బొక్కా శ్రీనివాస్ పేర్కొన్నారు.కార్యక్రమంలో ట్రెజరర్ పగడాల నగేష్, పితాని సత్యనారాయణ, శ్రావణ్ కుమార్, రాజయ్య, ఫణికుమార్, అంజయ్య, సంధ్య ప్రసాద్, పద్మా, ఝాన్సీ, కొందండపని తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అత్యున్నతమైన స్థానం గురువులదే

*** టీవీఆర్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి**




జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నేటి బాలలను రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అత్యున్నతమైన స్థానం గురువులదేనని టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకునే నేటి ఉపాధ్యాయ దినోత్సవం లో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని అపురూపకాలనీలో గల టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో, ఎస్ఆర్ నాయక్ నగర్లోని సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్ లో టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ & కరెస్పాండెంట్ టి. అరుణ కుమారి పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ. కోటి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో పనిచేస్తున్న ప్రతి టీచర్ ఉన్నతమైన ఉత్తమమైన విద్యాబోధనలను అందించాలన్నారు. టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ 137 సంవత్సరాలు గడిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తిదాయకంగా తీసుకుని ఒక సామాన్య ఉపాధ్యాయుడు సామర్థ్యం ఒక గొప్ప ఉన్నత శిఖరం అందుకు సర్వేపల్లి ఉదాహరణ అని తెలిపారు. అమ్మ ,నాన్న తరువాత జీవితాన్ని ఇచ్చేది ఉపాధ్యాయుడు కనుక మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన విద్యా బోధన పద్ధతితో విద్యార్థుల్ని చైతన్యవంతులుగా చేసి వారి జీవిత భవితవ్యానికి పునాదులు వేసే బాధ్యత గురువులదేనన్నారు. ప్రతి ఒక్క టీచర్ ఒక మార్గదర్శకం కావాలని కోరారు. అనంతరం టీచర్స్ అందరికి ఆటపాటలు నిర్వహించి ఆనందోత్సాహాలతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి , ప్రిన్సిపల్ ఎం జయరాజ్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నేత బొజ్జ రాఘవరెడ్డి 68వ జన్మదిన వేడుకలు




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ కమల నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి 68వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానికులు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి రాజకీయ, సామాజిక సేవలను పలువురు ప్రసంగకర్తలు గుర్తుచేసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా ఆయనను వర్ణించారు. ఆయన ప్రజా జీవన విధానం నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయమని హాజరైన నేతలు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఏఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరిపే ప్రవీణ్ వంజరి, పెంచాల సురేందర్ రావు, పత్తి కుమార్, పాత కోటి రామలింగం, సింగం కిరణ్, బేతాళ బాల్‌రాజ్, వెంకట్ రెడ్డి, పెంటయ్య, దత్తు, పెద్ది నవీన్ కుమార్, రామాచారీ, సుధాకర్, సహదేవ్, మధు చారి, ఆంజనేయులు, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్, వేముల శంకర్, విజయ్, నార్సింగి గౌడ్, తదితరులు హాజరై రాఘవరెడ్డి ని అభినందించారు. స్థానిక కాలనీవాసులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేసి,



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

*** 57 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాధికారి బి. నాగలక్ష్మి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి. ప్రతి విషయం మీద పూర్తి పట్టు సాధించి, విద్యార్థులు హోంవర్క్ పూర్తి చేయడాన్ని అలవాటు చేయాలి అని సూచించారు.విశిష్ట అతిథి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తి చేసిన రోజులను స్మరించుకుంటున్నాను. గురువుల బోధన విద్యార్థుల జీవితాంతం చిరస్థాయిగా నిలుస్తుంది. నా రాజకీయ ప్రయాణంలోనూ ఉపాధ్యాయుల సహకారం విశేషం అని అన్నారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ అభినందనలు. నిజానికి ప్రతి ఉపాధ్యాయుడు నా దృష్టిలో ఉత్తముడే అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ విద్యాశాఖను స్వయంగా తన దగ్గరే ఉంచుకుని సంస్కరణలు తీసుకువస్తున్నారు" అని పేర్కొన్నారు.జిల్లా విద్యాశాఖాధికారిణి నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాలకు మండల స్థాయిలో రూ.5000, జిల్లా స్థాయిలో రూ.15000 ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో 57 మంది ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి శాలువాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్నాం అని తెలిపారు.ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది. నాకు ఈ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువుగా మారారు. ఆయన దగ్గర శిక్షణలో అనేక విషయాలు నేర్చుకుంటున్నాను అన్నారు.ఈ సందర్భంగా విత్తనాల సేకరణలో జిల్లా కలెక్టర్ సూచన మేరకు ప్రథమ స్థానంలో నిలిచిన 23 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. కార్యక్రమానికి ముందు పలు పాఠశాలల విద్యార్థులు చేసిన స్వాగత నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు నాగరాజ్ శేఖర్, సైదులు, సతీష్, అన్నమణి, పరీక్షల విభాగం అధికారి మాధవరావు, డిసిఇబి కార్యదర్శి నీరజ్, కొత్తగూడెం ఎంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు పద్మలత, రమాదేవి, నిర్వహణ బాధ్యులు జంకిలాల్, బాలాజీ, నరేష్, ప్రేమ్, ప్రెస్ ఇంచార్జ్ షేక్ దస్తగిరి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా ఆచార్య కోదండరాం 70వ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మాజీ జె.ఏ.సి కన్వీనర్, టి.యు.ఎఫ్ రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మటి కిరణ్‌కుమార్‌రావు ఆధ్వర్యంలో ఆచార్య ఎం.ఎల్.సి.ఎం. కోదండరాం 70వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పూలబొకే అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జె.ఏ.సి నాయకుడు గరిక సుధాకర్, ఎరువా అశోక్, రవి చారి తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబ్ వీడియోలు చూసి.. చోరీల్లో ఆరితేరిన దొంగ అరెస్ట్

గుంటూరు: యూట్యూబ్ వీడియోలు చూస్తూ చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని గుంటూరు నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన జంగం బాజీ ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనిపై రౌడీషీట్ కూడా ఉంది. చోరీలు ఎలా చేయాలో గత కొంత కాలంగా యూట్యూబ్ వీడియోలు చూసి నేర్చుకున్నాడు. కారు అద్దాలను పగులకొట్టి కారులోని వస్తువులను రెప్పపాటులో దొంగిలించడంలో ఆరితేరాడు. వరుసగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలో చోరీలు జరుగుతుండటంతో పోలీసులు నిఘా పెట్టారు. సీసీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో దొంగను పట్టుకున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. మూడు నెలల వ్యవధిలో కార్ల అద్దాలు పగులగొట్టి 10 దొంగతనాలు చేశాడని.. నిందితుడి వద్ద నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, రూ.2లక్షల నగదుతో పాటు, 11 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బాజీపై 9 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులు

*** వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులని వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకుంటూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి బహుమతులను అందజేసి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.










# ఆస్తి కోసం అరాచకం.. తండ్రిని చంపి వాగులో పడేసిన కుమారుడు



కల్వకుర్తి : ఆస్తి కోసం రక్త సంబంధాలను మరిచి మృగాలుగా మారి ప్రాణాలు తీస్తున్నారు. కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన బాలయ్య (70)ను అతని కుమారుడు బీరయ్య కర్రతో కొట్టి దారుణంగా చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న బాలయ్య వ్యవసాయ క్షేత్రంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి లాగే ఆయన వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నాడు. బుధవారం సాయంత్రం బీరయ్య అక్కడికి వెళ్లి తండ్రితో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి.. అక్కడే ఉన్న కర్రతో తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేసి హతమార్చాడు. బాలయ్య మృతి చెందిన తర్వాత అతన్ని శవాన్ని కారు డిక్కీలో వేసుకొని చింతపల్లి బ్రిడ్జి వద్ద వాగులో పడేశాడు. రాత్రి వరకు బాలయ్య పొలం నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది సమీపంలో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ నాగార్జున, ఎస్సై మాధవ రెడ్డి సిబ్బందితో బాలయ్య పొలం వద్దకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రక్తపు మరకలను గుర్తించి, అనుమానం రావడంతో వెంటనే సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కుమారుడు బీరయ్య దాడి చేసి కారులో శవాన్ని వేసుకొని వెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. తండ్రి బాలయ్య మృతదేహాన్ని ఒంగురు మండలం డిండిచింతపల్లి బ్రిడ్జి వద్ద పడేసినట్లు పోలీసులకు చెప్పాడు. గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా.. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో మృతదేహం లభ్యమైంది.

## యూరియా సంక్షోభం వెనుక కుట్ర: కేటీఆర్

హైదరాబాద్: ఫిరాయింపులపై సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయన్నారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓటమి పాలవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బాన్స్‌వాడకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు శుక్రవారం భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే.. మరోసారి సుప్రీం కోర్టుకు వెళ్తామన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి పదవిపోయే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. యూరియా సంక్షోభం వెనుక కుట్ర ఉందని, పంట కొనగోళ్లు, బోనస్ ఎగ్గొట్టేందుకే యూరియా పంపిణీ చేయట్లేదని కేటీఆర్ ఆరోపించారు.



## మహా నిమజ్జనం.. సర్వం సిద్ధం



హైదరాబాద్: లంబోదరుడి నిమజ్జనోత్సవానికి నగరం ముస్తాబైంది. మహా నగరంలో గణేశ్ నిమజ్జనాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. రూ.54 కోట్లతో నగరవ్యాప్తంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు కల్పించింది. గణేశ్ ఉత్సవ సమితులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జనం జరిగే హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ తోపాటు 20 ప్రధాన చెరువులు, 74 కృత్రిమ కొలనుల వద్ద ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలో దాదాపు లక్షా 50 వేల విగ్రహాలు నిమజ్జనం కాగా.. రేపటి మహాక్రతువులో ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్‌లతో సహా దాదాపు 50 వేలకుపైగా విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి. ఇందుకోసం జీహెచ్ఎంసీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ సహా వివిధ శాఖలతో ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేసింది. 15 వేల మంది సిబ్బందితో గణేశ్ నిమజ్జనానికి సిద్ధమైన బల్దియా... 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేసింది. హుస్సేన్ సాగర్ చుట్టూ నిమజ్జనం సాఫీగా, వేగంగా జరిగేలా 11 పెద్ద క్రేన్లతో సహా 40క్రేన్‌లను భక్తులకు అందుబాటులో ఉంచింది. ఎన్టీఆర్ మార్గ్ లోని క్రేన్ నెంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరగనుండగా... ట్యాంక్ బండ్ వైపు ఏర్పాటు చేసిన క్రేన్ వద్ద బాలాపూర్ గణేశ్ నిమజ్జనం చేయనున్నారు. నగరవ్యాప్తంగా సుమారు 303 కిలోమీటర్ల మేర ఊరేగింపుగా గణనాథులు హుస్సేన్ సాగర్‌కు తరలిరానున్నారు. ఊరేగింపు దారిలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తుగానే 160 యాక్షన్ టీమ్‌లను సిద్ధం చేసిన జీహెచ్ఎంసీ... ఆ మార్గంలో దాదాపు 56,187 తాత్కాలిక లైట్లను అమర్చింది. మరోవైపు స్వచ్ఛతకు పెద్దపీట వేస్తూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను రంగంలోకి దింపింది. సుమారు 3 వేల మంది కార్మికులు వ్యర్థాల తొలగింపులో నిమగ్నమయ్యారు. 125 జేసీబీలు, 102 మినీ టిప్పర్ల ద్వారా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అలాగే హైడ్రా, పర్యాటక శాఖల సమన్వయంతో హుస్సేన్ సాగర్‌లో 9 బోట్లు, 200 మంది గజ ఈతగాళ్లను కూడా సిద్ధం చేశారు. పోలీసు శాఖ సహకారంతో 13 కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి నిమజ్జానికి తరలివచ్చే భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చూసేలా ఏర్పాట్లు చేశారు. హుస్సేన్ సాగర్ చుట్టూ నిమజ్జన ఏర్పాట్లను హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ వెంకట్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో పరిశీలించిన పొన్నం.. అంగరంగ వైభవంగా నిమజ్జనాలు జరిగేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు అన్ని విభాగాలతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు పొన్నం వివరించారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణనాథుల శోభాయాత్రలు సాఫీగా సాగేందురు ఊరేగింపు మార్గంలో రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయని, ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం వీలైనంత త్వరగా జరిగేలా చూస్తామని పొన్నం తెలిపారు.

## తెలంగాణలో 'ఖేలో ఇండియా గేమ్స్' నిర్వహించండి: మంత్రి వాకాటి విజ్ఞప్తి



దిల్లీ: తెలంగాణలో 'ఖేలో ఇండియా గేమ్స్' నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను కోరినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. త్వరలో మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి తెలిపారు.

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ అడుగులు: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ISB)లో మోతీలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగంపై ఎవరూ ఊహించనిరీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుందని చెప్పారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులు కళాశాల విద్య పూర్తి చేసుకొని బయటకు వెళ్లగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని... రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో 5 రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు.

## రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం అవ్వండి...

* **పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలం**
* **పెట్టుబడులు పెట్టండి.. రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోండి**
* **గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం**




తెలంగాణ బ్యూరో: రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ వీకెండ్ - దుబాయి 2025లో భాగంగా యూఏఈలో నిర్వహించిన సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డు(సైబా)ల ప్రదానోత్సవానికి మంత్రి అతిథిగా హాజరయ్యారు. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణ పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ సందర్భంగా వివరించారు. తెలంగాణ భౌగోళిక విస్తీర్ణంలో 11వ స్థానం, జనాభా పరంగా 12వ స్థానంలో ఉంది. అయినా... దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం కంటే ఎక్కువే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. గత 18 నెలల్లో తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఈవీ, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, ఏఐ, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల్లో రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది అని చెప్పారు. ఎలీ లిల్లీ లాంటి అనేక ప్రపంచ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా మార్చుకున్నాయి. ఇప్పటికే యూఏఈ పెట్టుబడిదారులు రూ.2వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. ఇది తెలంగాణ దుబాయ్ మధ్య రోజురోజుకీ బలపడుతున్న వాణిజ్య సంబంధాలకు చిహ్నంగా భావిస్తున్నాం అని అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారిని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. మా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామిగా పరిగణిస్తున్నాం. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిజిటల్ ఎకానమీ, స్మార్ట్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, లాజిస్టిక్స్, వేర్ హౌజింగ్, ట్రేడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవీ, ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు.

## తురకపాలెంలో వరుస మరణాలు...
## ఎమర్జెన్సీ ప్రకటించాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, సెప్టెంబర్ 05:** గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో గత రెండు నెలలుగా చోటుచేసుకుంటున్న వరుస మరణాలు తీవ్ర కలకలం రేపుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పరిస్థితిని సమీక్షించేందుకు రంగంలోకి దిగారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను 'హెల్త్ ఎమర్జెన్సీ'గా పరిగణించాలని, తక్షణం చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన సీఎం, ఈ సమస్య మూలాలను గుర్తించి, ప్రజల్లో భరోసా నింపాలని స్పష్టం చేశారు. గడిచిన జూలై, ఆగస్టు నెలల్లో గ్రామంలో పదుల సంఖ్యలో ప్రజలు అంతుచిక్కని వ్యాధితో మరణించడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి, అసలు కారణాలను నిగ్గు తేల్చాలని సూచించారు. తక్షణ కార్యాచరణలో భాగంగా, ఈ శని, ఆదివారాల్లో ప్రత్యేక వైద్య బృందాలను గ్రామానికి పంపించి, ప్రతి ఒక్కరికీ నిర్దేశించిన 42 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సోమవారం నాటికి గ్రామస్థులందరి 'హెల్త్ ప్రొఫైల్' సిద్ధం చేసి తనకు నివేదించాలని గడువు విధించారు. అనారోగ్యంతో తీవ్రంగా బాధపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని స్పష్టం చేశారు.

**కేంద్ర బృందాల సాయం తీసుకోండి**

"తురకపాలెం సమస్యను తేలిగ్గా తీసుకోవద్దు. అవసరమైతే ఎయిమ్స్ సహా కేంద్ర వైద్య బృందాలను గ్రామానికి రప్పించండి. అంతర్జాతీయ వైద్య నిపుణుల సలహాలు తీసుకోవడానికి కూడా వెనుకాడొద్దు" అని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, భూమి ద్వారా కూడా బ్యాక్టీరియా వ్యాపించే ప్రమాదం ఉందని, అన్ని కోణాల్లోనూ పరిశోధన జరపాలని ఆయన ఆదేశించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. "కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాకూడదు. ప్రతి రోగిని నిరంతర వైద్య పర్యవేక్షణలో ఉంచాలి. స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంచాల్సిన బాధ్యత మీదే" అని సీఎం స్పష్టం చేశారు.

**'మెలియోయిడోసిస్'గా అనుమానం!**

ఈ సమావేశంలో వైద్యాధికారులు తమ ప్రాథమిక పరిశీలన వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం బాధితుల్లో కనిపిస్తున్న లక్షణాలు 'మెలియోయిడోసిస్' అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌ను పోలి ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. నిర్ధారణ కోసం రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపామని, 72 గంటల్లో తుది నివేదికలు వస్తాయని తెలిపారు. తురకపాలెంలో పశుపోషణ అధికంగా ఉన్నందున, జంతువుల నుంచి ఏమైనా బ్యాక్టీరియా వ్యాపించిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. గ్రామంలో డయాబెటిస్, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, ఆల్కహాల్ వినియోగం కూడా అధికంగా ఉందని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్ల కారణంగా వాతావరణ నాణ్యతను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. బాధితుల్లో చాలామందికి మొదట జ్వరం, దగ్గుతో ప్రారంభమై, ఆ తర్వాత ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని వివరించారు. మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమిలో, నిల్వ ఉన్న నీటిలో ఉండే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని, ముఖ్యంగా వర్షాకాలంలో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు తెలిపారు. చర్మంపై ఉన్న గాయాల ద్వారా లేదా కలుషిత నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధిపై మైక్రోబయాలజీ విభాగం కూడా లోతుగా అధ్యయనం చేస్తోందని అధికారులు వివరించారు.

# నా హ్యాండ్‌బ్యాగ్‌లో ఇవి ఉండాల్సిందే!





**సినీ తారల జీవితం అందం, మేకప్‌తో ముడిపడి ఉంటుంది. అంతకుముందెలా ఉన్నా సినీ కెరీర్ ప్రారంభించాక మాత్రం వీటితోనే సావాసం చేయాలి. అయితే అందాల పోటీల్లో పాల్గొనాలన్న ఆలోచన చేశాకే తానూ తన వ్యక్తిగత సౌందర్యంపై దృష్టి పెట్టానంటోంది గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా. అంతకుముందు వరకు టామ్‌బాయ్‌లానే పెరిగానంటోన్న ఈ ముద్దుగుమ్మ.. సంతోషంగా ఉండడంలోనే అసలైన అందం దాగుందంటోంది. అలాంటి అందమైన క్షణాలు తన జీవితంలో బోలెడున్నాయంటోంది. ఇటీవలే ఓ సందర్భంలో వాటిని గుర్తుచేసుకుంటూనే.. మేకప్‌తో తనకున్న అనుబంధాన్ని, తన హ్యాండ్‌బ్యాగ్‌లో కచ్చితంగా ఉండే మేకప్ ఉత్పత్తుల గురించి బయటపెట్టింది పీసీ.**

### మా అమ్మకు భిన్నంగా..!

సినిమాల్లోకి రాకముందు సాదాసీదాగానే ఉండేవాళ్లమని చెబుతుంటారు చాలామంది నాయికలు. ప్రియాంక కూడా ఇందుకు మినహాయింపు కాదు. 17 ఏళ్ల వయసులో 'ప్రపంచ సుందరి' కిరీటాన్ని అందుకున్న ఈ ముద్దుగుమ్మ.. అంతకుముందు వరకు అందానికి ప్రాధాన్యమిచ్చేదే కాదట! తన తల్లి తన అందానికి మెరుగులు దిద్దాలని ఎంత ప్రయత్నించినా.. తాను మాత్రం టామ్‌బాయ్‌లానే పెరిగానంటూ ఇటీవలే ఓ సందర్భంలో అప్పటి రోజుల్ని గుర్తుచేసుకుంది పీసీ.

'మా అమ్మకు మేకప్ అంటే చాలా ఇష్టం. తన అందానికి మెరుగులు దిద్దుకునేందుకు ఎన్నెన్నో ప్రయత్నాలు చేసేది. ఇలాంటి వాతావరణంలో పెరిగినా.. అమ్మ ప్రభావం నాపై ఉన్నా నేను మాత్రం ఈ సౌందర్యం, మేకప్.. వంటి అంశాలపై దృష్టి పెట్టేదాన్నే కాదు. ఈ క్రమంలోనే టామ్‌బాయ్‌లా పెరిగా. 16 ఏళ్ల వయసొచ్చేదాకా అసలు నేనెలా ఉన్నానో కూడా ఆలోచించలేదు. కానీ ఎప్పుడైతే అందాల పోటీల్లో పాల్గొనాలన్న ఆలోచన చేశానో అప్పుడే నా వ్యక్తిగత సౌందర్యం, శరీరాకృతిపై దృష్టి పెట్టా. నా బ్యూటీ జర్నీ ప్రారంభమైంది కూడా అప్పుడే!' అంటూ తన టీనేజ్ విషయాల్ని పంచుకుంది గ్లోబల్ స్టార్.

### న్యాచురల్ ప్యాక్!

వృత్తిరీత్యా తెరపై మేకప్ వేసుకోవడానికే అధిక ప్రాధాన్యమిచ్చే మన అందాల తారలు.. తెరవెనుక మాత్రం న్యాచురల్‌గా ఉండడానికే ఇష్టపడుతుంటారు. తాను కూడా ఇంతే అంటోంది ప్రియాంక.

'షూటింగ్స్ లేనప్పుడు నా అందాన్ని ఇనుమడింపజేసుకోవడానికి మేకప్‌కి దూరంగా ఉంటా. ఈ క్రమంలోనే ఓ సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌ని ప్రయత్నిస్తా. పసుపు, పెరుగు కలిపి క్రీమ్‌లా తయారుచేసుకున్న మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంటయ్యాక ముఖం శుభ్రం చేసుకుంటా. దీనివల్ల తక్షణమే ముఖానికి మెరుపు వస్తుంది. అలాగే చర్మం మృదువుగా మారుతుంది. ఇక పెదాల్ని తేమగా ఉంచుకోవడానికి మీగడ అప్లై చేసుకుంటా. ఈ బ్యూటీ చిట్కాల్ని రాత్రి పడుకునే ముందు ప్రయత్నిస్తా. అయితే ఇవన్నీ మన చర్మానికి పైపైనే మెరుపును అందిస్తుంటాయి. అదే లోలోపలి నుంచి గ్లో రావాలంటే మాత్రం సంతోషంగా ఉండడమొక్కటే మార్గం. అందుకే నేనెప్పుడూ హ్యాపీగా ఉండడానికి ఇష్టపడతా. సినిమాల్లోకి రాకముందు నేను దిగిన ఫొటోల్లోనూ ఈ సంతోషం కనిపిస్తుంది. కాబట్టే అవి నా జీవితంలో మధుర క్షణాలు..' అని చెబుతోంది అందాల తార.

### నా బ్యూటీ బ్యాగ్‌లో..!

ఎక్కడికెళ్లినా మన హ్యాండ్‌బ్యాగ్‌లో కొన్ని ప్రాథమిక బ్యూటీ ఉత్పత్తుల్ని వెంట తీసుకెళ్తుంటాం. అలా తన బ్యూటీ బ్యాగ్‌లో కొన్ని సౌందర్యోత్పత్తులు, టూల్స్ కచ్చితంగా ఉండాల్సిందే అంటోంది ప్రియాంక.

* నా జుట్టు కాస్త పల్చగా ఉంటుంది.. దాంతో త్వరగా చిక్కులు కడుతుంది. వాటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవడానికి, జుట్టును తేమగా ఉంచుకోవడానికి నూనె నా బ్యాగ్‌లో ఎప్పుడూ నా వెంటే ఉంచుకుంటా.
* అలాగే ఓ ఎయిర్‌ర్యాప్ కూడా నా హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంటుంది. దీంతో తక్కువ వేడిని ఉపయోగించి జుట్టును కర్లీగా, స్ట్రెయిట్‌గా నాకు నచ్చినట్లుగా మార్చుకుంటా.
* ఇక ఐమాస్క్/ఫేషియల్ మాస్క్.. నా ముఖంపై వాపును తగ్గించి మెరుపు తీసుకొస్తాయి. తక్షణమే ఈ ఫలితం పొందాలంటే.. వీటిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి ఉపయోగిస్తా.
* మేకప్ వేసుకున్నా, వేసుకోకపోయినా మాయిశ్చరైజర్ కచ్చితంగా అప్లై చేసుకుంటా. రాత్రి మేకప్ తొలగించి పడుకునేటప్పుడూ దీన్ని రాసుకుంటా. కాబట్టి ఇదీ ఎప్పుడూ నాతో ఉండాల్సిందే!
* చర్మాన్ని తేమగా, ప్రకాశవంతంగా ఉంచుకోవడానికి విటమిన్ 'సి', హైఅల్యురోనిక్ ఆమ్లం ఉండే ఫౌండేషన్‌ని ఉపయోగిస్తా. అయితే ఇది నా చర్మ ఛాయలో కలిసిపోయేలా క్యారమిల్ షేడ్‌ని ఎంచుకుంటా.
* అన్ని చర్మఛాయలకు నప్పేలా ఎనిమిది షేడ్లతో కూడిన ఐషాడో ప్యాలెట్ ఎప్పుడూ నా బ్యూటీ బ్యాగ్‌లో ఉంటుంది. నేను ఎంచుకునే దుస్తుల్ని బట్టి ఇందులో నప్పిన షేడ్‌ని అప్లై చేసుకుంటా.
* లిప్‌బామ్ విషయంలో మరింత కచ్చితంగా వ్యవహరిస్తా. ఈ క్రమంలో పెదాలకు తేమను అందించే లక్షణాలున్న లిప్‌బామ్‌ని ఎంచుకుంటా. అలాగే ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్‌కే ప్రాధాన్యమిస్తా. చర్మ ఛాయతో సంబంధం లేకుండా ఇది అందరికీ నప్పుతుందనేది నా నమ్మకం. ఇక కొన్నిసార్లు లిప్‌స్టిక్‌తోనే బుగ్గలకు బ్లష్ చేస్తుంటా. ఇది చాలా సులభం.. త్వరగా పూర్తవుతుంది కూడా!





## మాటతో క్యాన్సర్‌ని పసిగట్టేస్తుంది!



మీరు మాట్లాడే మాట చెప్పాలనుకున్న విషయాన్నే కాకుండా, క్యాన్సర్‌గుట్టునీ బయటపెడితే? అవును, కంఠంలో వచ్చిన మార్పుల ఆధారంగా గొంతు క్యాన్సర్ గుట్టుని బయటపెట్టే విధంగా సరికొత్త ఏఐ టూల్‌ని అమెరికాకి చెందిన ఓరిగానో హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దీనికోసం పదమూడువేలమంది పైన పరిశోధనలు చేసి ఈ క్యాన్సర్‌కి గల కారణాలని విశ్లేషించారు. పొగాకు సంబంధిత ఉత్పత్తులు తినేవారిలోనూ, హెచ్‌పీవీ వైరస్ ద్వారానూ ఈ క్యాన్సర్ బారినపడుతున్నారనీ, మెడభాగంలో ఉండే ఈ క్యాన్సర్ కణితిని ముందుగానే గుర్తిస్తే దీని నుంచి బయట పడటం తేలికనీ అంటున్నారు శాస్త్రవేత్తలు. సంప్రదాయ విధానంలో గొంతులోకి సన్నని పైప్‌ని పంపి, మరికొన్నిసార్లు కెమెరాని వాడి కూడా ఈ క్యాన్సర్‌ని గుర్తిస్తుంటారు. అలాంటప్పుడు ఒక వేళ నిపుణులు సరిగా కణితిని కనిపెట్టలేకపోతే, క్యాన్సర్ ఉన్నా బయటపడని సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయట. వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో కచ్చితంగా నిర్ధరించేందుకు వీలుగా ఈ 'బ్రిడ్జ్2ఏఐ' అనే టూల్‌ని తీసుకొచ్చారు.



## ఇది అతికించే పెన్ను!

చదివేది ఒకటీ రెండూ తరగతులే అయినా పెన్నులూ, పెన్సిళ్ల నుంచి గ్లూ బాటిల్ వరకూ రకరకాల స్టేషనరీ వస్తువులన్నీ ఉండాల్సిందే అంటారు పిల్లలందరూ. హోంవర్క్‌లో భాగంగానో, సరదాగానో ఏదో ఒక క్రాఫ్ట్ చేస్తూనే ఉంటారు. అందులో ఏవైనా అతికించాల్సి వస్తే గ్లూ బాటిళ్లను అడ్డదిడ్డంగా వాడేస్తుంటారు. చేతులకూ రాసేసుకుంటారు. ఆ ఇబ్బందిని తప్పించడానికే వచ్చింది 'గ్లూపెన్'. మామూలు పెన్నులాగే అవసరమైన చోట దీంతో రాస్తే చాలు, గమ్ కాగితం మీద పడుతుంది. అంతేకాదు, దీంతో మనకు కావాల్సినట్టే గ్లూని రాయొచ్చు. ఉదాహరణకు ఏదైనా పూల కాగితాల్ని తయారు చేస్తున్నప్పుడు వాటన్నింటినీ అతికించుకోవడానికి మొత్తమంతా రుద్దకుండా సన్నని చుక్కల్లాగో, గీతల్లాగో గ్లూని పెట్టుకోవచ్చు. ఇంకా కాగితం మీద గ్లూతో పేర్లు రాస్తూ, అందమైన డిజైన్లు వేస్తూ దాని మీద మెరుపులూ అతికించుకోవచ్చు.

## బాడీ లోషన్ రాస్తున్నారా..?



**ఎప్పటికప్పుడు మారే వాతావరణం చర్మం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తద్వారా చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలామంది. కానీ వీటిలో కూడా చర్మతత్వానికి నప్పే లోషన్లను ఎంచుకోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. అప్పుడే ఫలితం ఉంటుందంటున్నారు.**

### కాస్త తడిగా ఉన్నప్పుడే..

ముఖానికి లేదా చర్మానికి క్రీమ్‌లు, లోషన్లు.. మొదలైనవి రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే అది చర్మ గ్రంథుల్లోకి చేరే అవకాశం ఉంటుంది. తద్వారా చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు.

### స్నానం చేసిన వెంటనే..

క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మ కణాలు తెరుచుకొని ఉంటాయి.. కాబట్టి ఆ సమయంలో క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అది చర్మ గ్రంథుల్లోకి చేరి సులభంగా ఇంకుతుంది. అలాగే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉండే క్లోరిన్ వల్ల చర్మం మరింత పొడిగా మారే ప్రమాదం ఉంటుంది.

### చర్మం ఉష్ణోగ్రతను బట్టి..

అలాగే చర్మం కాస్త వేడిగా ఉన్నప్పుడే క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అవి చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు నిపుణులు. అందుకే క్రీమ్ లేదా లోషన్ రాసుకునే ముందు చర్మం చల్లగా అనిపిస్తే.. గోరువెచ్చని నీళ్లలో ముంచిన టవల్‌తో తుడుచుకొని ఆపై లోషన్‌ను చర్మానికి అప్లై చేసుకోవాలంటున్నారు.

### ఎన్నో ప్రయోజనాలు..

* పొడిబారి నిర్జీవంగా మారిపోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవడంతో పాటు పునరుత్తేజితం అవుతుంది.
* బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించడానికీ ఉపయోగపడుతుంది.
* అలాగే బాడీ లోషన్ వెదజల్లే పరిమళాలు మానసిక ప్రశాంతతనూ అందిస్తాయి.
* గరుకుగా ఉండే చర్మ భాగాలపై తరచుగా క్రీమ్ లేదా లోషన్స్ అప్లై చేయడం వల్ల కొన్నాళ్లకు అవి మృదువుగా మారతాయి.

## దువ్వెనే రంగు వేస్తే!



ఒక వయసు వచ్చాక తెల్లజుట్టు రావడం మామూలే. సమయం ఉంటే వారానికోసారి డై వేసుకోవడం, హెన్నా పెట్టుకోవడం చేస్తుంటారు. కానీ కొన్నిసార్లు అనుకోకుండా బయటికి వెళ్లాల్సి వస్తుంది. మరికొన్నిసార్లు కేవలం పాపిట దగ్గర తలపైన కనిపించే చోట్ల మాత్రమే తెల్ల వెంట్రుకలు కనిపిస్తుంటాయి. సరిగ్గా అలాంటి సందర్భాల్లోనే 'క్విక్ కవర్ గ్రే హెయిర్ టచప్ కోంబ్' బాగా ఉపయోగపడుతుంది. జుట్టు కుదుళ్ల దగ్గరా, నెరిసిన వెంట్రుకలపైనా దాంతో దువ్వితే చాలు. దువ్వెనలోనే డై ఉంటుంది కాబట్టి క్షణాల్లో నల్లగా మారిపోతుంది జుట్టు అంతా. ఈ డై దువ్వెనను ఎక్కడైనా ఎప్పుడైనా ఎంచక్కా వాడుకోవచ్చు.

# సౌత్ అంతా తనదే అంటున్న ఆ కన్నడ కస్తూరి



టాకీస్: ఇండస్ట్రీకి ఎంతోమంది హీరోయిన్లు వస్తుంటారు పోతుంటారు కానీ ఇక్కడే సెటిల్ అయిపోయేవాళ్లు మాత్రం చాలా తక్కువగా ఉంటారు. అందులో తాను కూడా ఉన్నానంటున్నారు ఓ కన్నడ బ్యూటీ. ఈ మధ్య ఎక్కడ చూసినా ఆమె పేరే వినిపిస్తుంది.. పైగా రాబోయే 8 నెలల్లో ఆమె నుంచి 4 ప్యాన్ ఇండియన్ సినిమాలు రానున్నాయి. రుక్మిణి వసంత్.. నిన్నటి వరకు కేవలం కన్నడలో మాత్రమే ఎక్కువగా వినిపించిన పేరు. ఇప్పటికే అక్కడ సప్త సాగరాలు దాటి, బఘీరా లాంటి సినిమాలతో స్టార్ అయిన ఈ బ్యూటీ.. ఇప్పుడు తమిళ, తెలుగుపై కూడా ఫోకస్ చేసారు. సెప్టెంబర్ 5న ఈమె నటించిన మదరాశి విడుదల కానుంది. శివకార్తికేయన్ ఇందులో హీరోగా నటించారు. రాబోయే 8 నెలల్లో రుక్మిణి నుంచి 4 ప్యాన్ ఇండియన్ సినిమాలు రానున్నాయి. అందులో మదరాశి ఈ వారంలోనే రానుంది. ఇక అక్టోబర్ 2న కాంతార ఛాప్టర్ 1తో రాబోతున్నారు రుక్మిణి. రిషబ్ శెట్టి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఎలా ఉన్నాయనేది చెప్పాల్సిన పనిలేదు. కాంతార 2లో కనకవతి పాత్రలో నటిస్తున్నారు ఈ బ్యూటీ.2026 ఫస్టాఫ్‌లోనూ రుక్మిణి హవానే కనిపించ బోతుంది. మార్చి 19న యశ్ టాక్సిక్.. జూన్ 25న ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ డ్రాగన్‌తో రానున్నారు. వీటితో పాటు విక్రమ్ తనయుడు ధృవ్ నెక్స్ట్ సినిమాలో రుక్మిణి పేరు వినిపిస్తుంది. మొత్తానికి మరో మీనాక్షి చౌదరి, శ్రీలీలలా కాకుండా.. ఈమె అయినా వచ్చిన క్రేజ్‌ను సరిగ్గా వాడుకుంటారా లేదా చూడాలి.

# ఫుల్ జోష్‌లో మన శంకర వరప్రసాద్ గారు

## తాజా షూటింగ్ షెడ్యూల్ విడుదల




**టాకీస్:** అనిల్ రావిపూడి దర్శకత్వంలో అగ్రకథానాయకుడు చిరంజీవి నటిస్తోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరుతో పాటు ఈ సినిమా టీమ్ మొత్తం ఫుల్ జోష్‌తో ఉంది. తాజా అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసింది. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను పంచుకుంది. ఇప్పటికే ఈ సినిమా కేరళలో కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో షెడ్యూల్‌ను ప్రారంభించారు. నేటి నుంచి సెప్టెంబర్ 19 దాకా చిత్రీకరణ జరగనుంది. ఇందులో రెండు పాటలు చిత్రీకరించనున్నట్లు- టీమ్ తెలిపింది. ఇవి కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని పేర్కొంది. సంక్రాంతికి ఈ సినిమాతో ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇవ్వనున్నట్లు- టీమ్ తెలిపింది. వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. తాజాగా సాహు గారపాటి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అక్టోబర్ 5 నుంచి నిర్వహించనున్న మరో షెడ్యూల్‌లో వెంకటేశ్ భాగం కానున్నట్లు- తెలిపారు ఇక వచ్చే ఏడాది చిరంజీవి వరుసగా రెండు సినిమాలతో అలరించనున్నారు. ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో సందడి చేసేందుకు సిద్ధమవుతుండగా.. వేసవిలో 'విశ్వంభర'తో పలకరించనున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' ముస్తాబవుతోంది. ఇందులో వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధ్యానత ఉండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో 5 శాతం మాత్రమే వీఎఫ్ఎక్స్ ఉపయోగించారు. 'విశ్వంభర'లో చిరు సరసన త్రిష కనిపించనుండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో నయనతార నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల ప్రచార చిత్రాలు ఆకట్టుకోవడంతో వీటిపై అంచనాలు నెలకొన్నాయి.

# కాంతారా-2లో రిషబ్ యాక్షన్ సన్నివేశాలు



**టాకీస్:** కన్నడ నటుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'కాంతార చాప్టర్ 1' 2022లో వచ్చిన 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఇది సిద్ధమవుతోంది. రిషబ్ స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలను రిషబ్ స్వయంగా చేశారని తెలిపారు. ఒక్క యాక్షన్ సన్నివేశంలో కూడా డూప్ ఉపయోగించలేదు. రిషబ్ రిస్క్ చేసి ఎన్నో స్టంట్స్ చేశారు. ఆయన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని యాక్షన్ సన్నివేశాలను కూడా డూప్ లేకుండా చేశారు. కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలతో పాటు- యుద్ధ కళగా ప్రాచుర్యం పొందిన కలరిపయట్టు-లోనూ శిక్షణ తీసుకున్నారు. నేను ఇప్పటి వరకూ చాలా మంది నటు-లతో వర్క్ చేశాగానీ రిషబ్‌లాంటి హీరోను చూడలేదు. 'నేను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని అనడు.. నేను బ్రతికి ఉన్నంత వరకూ దీన్ని చేస్తాను' అని చెబుతాడు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి అంటూ స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ హీరో రిషబ్‌పై ప్రశంసలు కురిపించారు. కాంతార' రూ. 16 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, రూ. 400 కోట్లు వసూళ్లు చేయడం విశేషం. తొలిభాగం కథ ఎక్కడి నుంచి ప్రారంభమైందో.. దానికి ముందు జరిగిన సంఘటనలను 'కాంతార చాప్టర్ 1'లో చూపించనున్నారు. పంజుర్లికి సంబంధించిన సన్నివేశాలు ప్రీక్వెల్‌లో ఎక్కువగా ఉండనున్నాయి. ముందుగా కన్నడలో విడుదలై హిట్‌గా నిలిచిన 'కాంతార'.. ఆ తర్వాత ఇతర భాషల్లో డబ్ అయిన సంగతి తెలిసిందే. 'కాంతార 2'ను ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# డిసెంబర్‌లో విడుదలకు సిద్ధంగా అఖండ-2



**టాకీస్:** నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'అఖండ 2' విడుదలపై అభిమానుల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో విజయం సాధించిన 'అఖండ' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా, తొలుత సెప్టెంబర్ 25న రిలీజ్ అవుతుందన్న ప్రకటన వచ్చినా, తర్వాత రిలీజ్ వాయిదా పడింది.తాజాగా ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొన్న బాలకృష్ణ, 'అఖండ 2' రిలీజ్‌పై స్పందించారు. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో సినిమా థియేటర్లలోకి వస్తుందని తెలిపారు. అయితే ఖచ్చితమైన విడుదల తేదీని మాత్రం వెల్లడించలేదు. ఫ్యాన్స్ అంచనాల ప్రకారం, డిసెంబర్ 5 శుక్రవారం కావడంతో అదే రోజు రిలీజ్ అయ్యే అవకాశముంది. కానీ సినిమా మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఇప్పటికే బాలకృష్ణ తన డబ్బింగ్ పార్ట్ పూర్తి చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్పీడ్‌లో సాగుతున్నాయి. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉండటంతో, సినిమాకు కావాల్సిన మాస్ విజువల్ ఎఫెక్ట్ డెలివర్ చేయాలంటే మరికొంత సమయం అవసరం కావడంతోనే రిలీజ్ వాయిదా వేశామని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాలో బాలయ్య సరసన సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. విలన్ పాత్రలో ఆది పినిశెట్టి కనిపించ నున్నారు. మాస్, ఆధ్యాత్మికత, సామాజిక అంశాలు, యువతకి సందేశం ఇలా విభిన్న అంశాలను మిళితం చేస్తూ బోయపాటి శ్రీను ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు- సమాచారం. తమన్ సంగీతం, పవర్‌ఫుల్ డైలాగ్స్, భారీ యాక్షన్ సన్నివేశాలు అభిమానులకు మాస్ ఫెస్టివల్‌ను తలపించేలా ఉంటాయని టాక్. రిలీజ్‌కు ముందే ఈ సినిమా డిజిటల్ హక్కులు భారీ ధరకు అమ్ముడయ్యాయని సమాచారం. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జియో హాట్‌స్టార్', రూ.85 కోట్లు- చెల్లించి డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులు సొంతం చేసుకుంది. సింహ, లెజెండ్, అఖండ వంటి హిట్ చిత్రాల తర్వాత బాలయ్య - బోయపాటి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో విశ్వాసం మరో లెవెల్‌కి చేరింది. ఇప్పుడు అదే జోడీ నుంచి వస్తున్న 'అఖండ 2' మరింత భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది.

# కొత్త తరహాలో ...లిటిల్ హార్ట్స్

**టాకీస్:** ఈటీవీ విన్ ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొట్ట మొదటి థియేట్రికల్ సినిమా 'లిటిల్ హార్ట్స్'. '90స్ మిడిల్‌క్లాస్ బయోపిక్'తో యువతకు చేరువైన మౌళి తనూజ్ ఇందులో కథానాయకుడిగా నటించగా, ఆ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఆదిత్య హసన్ దీనికి నిర్మాత కావడం విశేషం. అఖిల్ (మౌళి తనూజ్) చదువుల్లో అంతంత మాత్రమే. అందుకే ఎంసెట్‌లో ర్యాంక్ రాదు. పేమెంట్ సీట్‌తో ఏదో ఒక కాలేజీలో ఇంజినీరింగ్ చేరాలనుకుంటాడు. కానీ, తండ్రి గోపాలరావు (రాజీవ్ కనకాల) మాత్రం లాంగ్ టర్మ్ కోచింగ్‌కి పంపిస్తాడు. కాత్యాయని (శివానీ నాగారం)ది కూడా అదే కథే. ఆమె తల్లిదండ్రులిద్దరూ డాక్టర్లే. తమ కూతురిని కూడా డాక్టర్‌గా చూడాలనేది వాళ్ల లక్ష్యం. అందుకే కాత్యాయని కూడా ఇంటర్ తర్వాత లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేరుతుంది. అక్కడే అఖిల్, కాత్యాయని పరిచయమవుతారు. ఆ పరిచయం ప్రేమకు దారితీస్తుంది. అఖిల్ తన మనసులో మాటని బయట పెడతాడు. అప్పుడు కాత్యాయని తనకు సంబంధించిన ఓ విషయాన్ని బయట పెడుతుంది. దాంతో ఈ జంట ప్రేమకథలో ఓ పెద్ద మలుపు తీసుకుంటుంది. స్కూల్ డేస్‌లోనూ... కాలేజీలోనూ మొగ్గ తొడిగిన ప్రేమకథలతో తరచూ సినిమాలు వస్తూనే ఉంటాయి. క్యాంపస్ స్టోరీలుగా, రొమాంటిక్ కామెడీ కథలుగా అవి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం. వాటికి భిన్నంగా కోచింగ్ సెంటర్ నేపథ్యంలో సాగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందింది. ట్రైలర్‌లో చెప్పినట్టే అంతగా చదువు అబ్బని ఓ అబ్బాయి, అమ్మాయి చుట్టూ తిరిగే కథ ఇది. చాలా సింపుల్‌గానే ఉంటుంది. కానీ, కావల్సినంత ఫన్‌ని పండిస్తుంది. యువతరం నేపథ్యంలో సాగే ఇలాంటి సరదా సరదా సినిమాలు ఈ మధ్య కాలంలో రాలేదు.




# పుష్ప తరహాలో గంజాయి స్మగ్లింగ్

## అనుష్క నటించి మెప్పించిన ఘాటి

టాకీస్: సున్నితమైన కథలతో సినీప్రియుల్ని అలరించే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. అనుష్కను యాక్షన్ కోణంలో చూపిస్తూ 'ఘాటి' సినిమాని తీసుకొచ్చారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లోని తూర్పు కనుమల్లో జరిగే కథ ఇది. అక్కడి ఎత్తయిన పర్వతాల మధ్య ఓ కొండ నీడ మరో కొండపై పడే చోట నాలుగు రకాల గంజాయిలు పెరుగుతాయి. వాటిలో అత్యంత నాణ్యమైనది, ఖరీదైనది శీలావతి రకం. ఆ కనుమల్లో పండే ఈ గంజాయి పంటపై పూర్తి ఆధిపత్యం కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్), కుందుల నాయుడు (చైతన్య రావు) సోదరులదే. కనుమల్లో పండే గంజాయి పంటను ఘాటీ తెగ కూలీలు పోలీసుల కంట పడకుండా అక్రమంగా నాయుడు సోదరుల అడ్డాకు చేరవేస్తే.. దాన్ని వాళ్లు తమ బాస్ మహావీర్ (జిషు సేన్ గుప్తా)కు పంపుతారు. అతని కార్టెల్ దాన్ని దేశ విదేశాలకు అక్రమ మార్గాల్లో ఎగుమతి చేసి సొమ్ము చేసుకోవడం పరిపాటి. అయితే ప్రాణాలకు తెగించి గంజాయిని అక్రమ రవాణా చేసే ఘాటీలకు కష్టానికి తగ్గ ఫలితం, గౌరవం దక్కకపోవడంతో ఆ తెగకు చెందిన దేశీరాజు (విక్రమ్ ప్రభు) ఓ ఆలోచన చేస్తాడు. తన మరదలు శీలావతి (అను)తో పాటు- తోటి ఘాటీలతో కలిసి ఓ కొత్త దందాకు తెర లేపుతాడు. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి దేశ విదేశాలకు ఎగుమతి చేయడం మొదలు పెడతారు. అయితే ఈ విషయం నాయుడు సోదరులకు తెలియడంతో ఘాటీలను అంతమొందించేందుకు సిద్ధమవుతారు. ఈ క్రమంలో శీలావతికి జరిగిన అన్యాయమేంటి? నాయుడు సోదరులతో ఆమె ఎలాంటి యుద్ధం చేసిందన్నదే సినిమా కథ. ఇది గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథగా కనిపించినప్పటికీ.. ప్రధానంగా ఇదొక ప్రతీకార కథ. . నిజానికి ఈ కథ.. దీంట్లోని స్మగ్లింగ్ నేపథ్యాన్ని చూస్తే 'పుష్ప' ఛాయల్లో నుంచి వచ్చిన సినిమాలాగే అనిపిస్తుంది. అయితే అందులో హీరో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ తన సామ్రాజ్యాన్ని అంతకంతకూ విస్తరించు కుంటూ వెళ్లే ప్రయత్నం చేయగా.. ఇందులో కథానాయిక గంజాయి స్మగ్లింగ్ వల్ల జరుగుతున్న అనర్థాల్ని, దారుణాల్ని చూసి ఆ స్మగ్లింగ్‌నే ఆపి తమ తెగతో పాటు ఎంతో మంది ప్రజల్ని కాపాడేందుకు నడుం బిగిస్తుంది.తూర్పు కనుమలు.. అక్కడి కొండల మధ్య సాగే గంజాయి అక్రమ సాగు.. దాన్ని దందాగా చేసుకుని బతికే నాయుడు సోదరులు.. అతనిపైనున్న కార్పొరేట్ ముఠాను చూపిస్తూ కథను ప్రారంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత ఘాటి తెగను తెరపైకి తెచ్చి వాళ్ల నేపథ్యాన్ని.. గంజాయి స్మగ్లింగ్‌లో వాళ్ల శక్తి సామర్థ్యాల్ని పరిచయం చేశారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.